ఆంధ్రప్రభ సచిత్రవార పత్రికలో
1991 లో ప్రచురించబడి
విశేష ప్రజాదరణ పొందిన
**మిస్టరీ నవల**

రచయిత:
పసుపులేటి తాతారావు

# యాదృచ్ఛికం

(గత సంచిక తరువాయి భాగం..)

"మొదటి ప్రశ్న. 'ఆల్ ద వరల్డ్ ఈజ్ ఏ స్టేజ్ అండ్ ఆల్ ద మెన్ అండ్ వుమెన్ ఆర్ మియర్లీ ప్లేయర్స్.' ఈ మాట ఎవరన్నారు ?"

అమృతేష్‌ని తక్కువగా అంచనా వేయడం వల్ల మొదటి ప్రశ్న ఆ విధంగా వృధా అయింది.

"షేక్స్పియర్. ఏజ్ యూ లైక్ ఇట్‌లో" అని చెప్పాడు అమృతేష్. సితార ఆశ్చర్య పోయింది. ఈ సారి కొంచెం కష్టతరమైన ప్రశ్న వేయాలని అనుకుంది. రెండు నిముషాలు ఆలోచించి రెండో ప్రశ్న అడిగింది.

"నవలాకారిణి అన్నే పారిష్ 1888లో పుట్టింది. కవి రాబర్ట్ ఫ్రాస్ట్ 1874లో పుట్టాడు. ఆమె వయసు కంటే అతని వయసు ఎంత ఎక్కువ ?"

మిగిలిన అమ్మాయిలిద్దరూ ఉలిక్కిపడ్డారు. పుట్టిన సంవత్సరాలు చెప్పేసి అంత సాధారణమైన ప్రశ్న ఎందుకేసిందో వాళ్ళకి అర్థం కాలేదు.

కానీ అమృతేష్ అర్థం చేసుకోగలిగాడు. ఏదో విధంగా తనని అక్కడినుంచి లేపాలనే ఆమె అలాంటి తికమక ప్రశ్న వేస్తోందని గ్రహించాడు. రెండు నిముషాలు తన జ్ఞాపకశక్తికి పదును పెట్టి అప్పుడు సమాధానం చెప్పాడు.

"ఇరవై సంవత్సరాలు"

సితారకు కంగారు పట్టుకుంది. "ఎలా ?" అని అడిగింది నుదుట పట్టిన చెమట తుడుచుకుంటూ.

"ఆ రచయిత్రి 1957 లో మరణించింది. ఆ కవి 1963లో మరణించాడు. అంటే ఆమె 69 సంవత్సరాలు, అతను 89 సంవత్సరాలు జీవించారన్నమాట. కాబట్టి ఆమె వయసుకన్నా అతని వయసు ఇరవై సంవత్సరాలు ఎక్కువ" అన్నాడు.

సితారతో పాటు మిగిలిన అమ్మాయిలకు కూడా ఈసారి కంగారు పట్టుకుంది. కళ్ళముందు గుంజీలు, సాష్టాంగ నమస్కారాలు కదలాడసాగాయి. మూడో ప్రశ్నని జనరల్ నాలెడ్జికి సంబంధించని విధంగా అడగడానికి నిశ్చయించుకుంది సితారు.

"మూడో ప్రశ్న. పొట్టి, పొడవు వ్యక్తులిద్దరు ఒక గుండ్రటి ఆట స్థలం అంచున నిలబడి ఉన్నారు. పొట్టివాని కన్నా పొడవు వాడు ఏ పనినైనా సరిగ్గా పన్నెండు రెట్ల వేగంతో చేస్తాడు. పొడవు వ్యక్తి పొట్టి వ్యక్తితో "నేను ఇప్పుడే ఒక్క గంటలో ఈ స్థలాన్నంతా చుట్టి వస్తాను. ఎక్కడికీ వెళ్ళకు" అని చెప్పి బయల్దేరాడు.

కానీ ఆ పొట్టి వ్యక్తి కూడా అదే దిశలో బయల్దేరాడు. పొడవు వ్యక్తి మళ్ళీ పొట్టి వ్యక్తిని ఎప్పుడు కలుసు కుంటాడు ?"

అమృతేష్ కళ్ళు మూసుకుని కాసేపు ఆలోచించి అప్పుడు చెప్పాడు. "సరిగ్గా ఒక గంటా అయిదు నిముషాల అయిదూ పాయింట్ రెండు సెకన్లకి."

సితార హతాశురాలైంది. ఆమెను చూసి విషయం అర్థం చేసుకున్న మిగతా అమ్మాయిలకు గుండె బేజారెత్తింది. ఎదుటి వాళ్ళని తక్కువగా అంచనా వేయడం ఎల్లప్పుడూ మంచిది కాదని అప్పుడు అర్థం చేసుకున్నారు. కానీ ఏం లాభం ? అప్పటికే ఆలస్యం అయిపోయింది. ఇప్పుడు ఇంత మందిలో గుంజీలు తీయడం, సాష్టాంగ ప్రణామాలు ఎలా ?

అమ్మాయిలందరి ముఖాలూ కళావిహీనమైపోయి ఉన్నాయి. ఏం చేయడానికీ పాలుపోని ఏం మాట్లాడాలో తోచని ఇబ్బంది.

"ఓడిపోయారుగా ?" అడిగాడు అమృతేష్.

వాళ్ళ గుండెలు గుభిల్లుమన్నాయి. పందెం ప్రకారం గుంజీలు తీయమంటాడేమోనని.

"భయపడకండి. ఎంత పందెం గెలిచినా ఆడ పిల్లలచేత నడివీధిలో గుంజీలు తీయించేంత కఠినాత్ముడిని కాను. వెళ్ళి రండి" అన్నాడు.

అప్పటికి కానీ వాళ్ళు హాయిగా ఊపిరి పీల్చుకోలేక పోయారు. ముగ్గరూ కృతజ్ఞతా పూర్వకంగా చూసి వెళ్ళబోయారు.

"మిస్ సితారా" అని పిలిచాడు.

వెళ్ళబోతున్నదల్లా వెనక్కి తిరిగి చూసింది.

"తెలివి తేటలు ఉంటేనే సరిపోదు. సమయస్ఫూర్తి కూడా ఉంటే బాగుంటుంది" అన్నాడు.

"దేని గురించి మీరనేది ?"

"మీ మూడో ప్రశ్నకి సమాధానం రెండు రకాలుగా చెప్పొచ్చు. ఒకటి గణితం. రెండోది తార్కికం. నేను జవాబు చెప్పినప్పుడు తార్కికంగా మీరు దాన్ని తప్పని ఋజువు చేసి పందెం గెలిచి ఉండొచ్చు" అన్నాడు.

"అదెలా ?" ఆశ్చర్యంగా అడిగింది.

"ముందు బయల్దేరిన పొడవు వ్యక్తి తిరిగి బయల్దేరిన చోటికి వచ్చేటప్పటికి పొట్టి వ్యక్తి ఎంతో కొంత దూరం ముందుకి పోయి ఉంటాడనడంలో సందేహం లేదు. అవునా ?"

"అవును."

"మళ్ళీ పొడవు వ్యక్తి పొట్టి వ్యక్తి ఉన్న చోటుకి వెళ్ళే సరికి ఆ పొట్టి వ్యక్తి మళ్ళీ ఎంతో కొంత దూరం ముందుకు పోయి ఉంటాడు. అవునా ?"

"అవును."

"అలా కొంచెం దూరం. కొంచెం దూరం చొప్పున పొట్టి వాడు ఎప్పటికీ ముందుకు పోతూనే ఉంటాడు. పొడవు వ్యక్తి ఎప్పటికీ అతన్ని చేరుకోలేడు. అలా తిమ్మిని బమ్మి బమ్మిని తిమ్మి చేయొచ్చు."

సితార విస్ఫారిత నేత్రాలతో చూసింది. మిగిలిన అమ్మాయిలకైతే పూర్తిగా మతే పోయింది.

"ఏది ఏమైనా పందెంలో ఓడిపోకుండా కాపాడిన మీ కళ్ళకు జోహార్లు !" అన్నాడు అమృతేష్.

"నా కళ్ళా ?" ఆశ్చర్యంగా అడిగింది సితార.

"అవును. మీ మూడో ప్రశ్నకు నేను సమాధానం అంత తేలిగ్గా చెప్పలేక పోయి ఉండేవాణ్ణేమో. పొట్టివాడు, పొడవు వాడూ లెక్క మీరు ఆ గోడకున్న గడియారంలోని పెద్ద ముల్లు, చిన్న ముళ్ళను చూసే అడిగారు. మీ కళ్ళు ఆ గడియారాన్ని చూడ్డం నేనూ చూసాను. అందుకే అంత తేలిగ్గా సమాధానం చెప్ప గలిగాను" అన్నాడు.

"యూ ఆర్ రియల్లీ జీనియస్" అంది సితార.

"థాంక్యూ" అన్నాడు.

అలా హోటల్‌లో ఏర్పడిన పరిచయం అక్కడితో ముగిసిపోయి ఉండేదే. కానీ ఆ తరువాత కూడా వాళ్ళిద్దరూ యాదృచ్ఛికంగా పదే పదే కలుసుకోవాల్సి రావడంతో ఆ పరిచయం స్నేహంగా మారింది. క్రమంగా ఆ స్నేహం సితార విషయంలో అమృతేష్ ప్రమేయం ఏమీ లేకుండానే ప్రేమగా మారింది.

అయితే అమృతేష్ ఆమె ప్రేమని ఎప్పుడూ అంగీకరించ లేదు.

యాదృచ్ఛికంగా అమృతేష్, సితార పదే పదే తర్వాత కూడా
ఎందుకు ఏ పరిస్థితుల్లో కలుసుకోవాల్సి వచ్చింది ?
అలా కలుసుకోవడం వల్ల కలిగిన జరిగిన పరిణామాలేమిటి ?
సితార ప్రేమని అమృతేష్ ఎందుకు అంగీకరించ లేదు ?
తెలుసుకోవాలనుందా ?

జస్ట్ వెయిట్ ఫర్ సమ్ మోర్ టైమ్ ప్లీజ్.